క్లుప్తంగా

పిల్లలను శాస్త్రవేత్తలుగా తయారు చేయాలి



ప్రయోగశాలను పరిశీలిస్తున్న డీఈవో

జైపూర్: కొత్తకొత్త ఆలోచనలతో పిల్లలు శాస్త్రవేత్తలుగా ఎదగాలని, ఉపాధ్యాయులు పిల్లలను శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన అటల్ టిక్కరింగ్ ప్రయోగశాలను జిల్లా సైన్స్ అధిఆరి మధుబాబు, ఎంఈవో శ్రీనివాస్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రయోగశాలలో ఉన్న పరికరాలను పరిశీలించారు. విద్యార్థి దశ కీలకమైందని, చిన్న వయస్సు నుంచే ఆలోచనలు పుట్టాలని, గొప్పగొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని పిల్లలు ప్రయోగాలు చేయాలన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు గొప్పస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ఆయా రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అలీస్ మాధుర్య, పాఠశాల చైర్‌పర్సన్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో 25ను సవరించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

దండేపల్లి: ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం 25 ను సవరించాలని, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. దండేపల్లిలో మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

'కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం'



మాట్లాడుతున్న లాల్‌కుమార్

పాతమంచిర్యాల: కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎ.లాల్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ కాలనీలో శనివారం కుల వివక్షతపై సదస్సు నిర్వహించారు. ప్రజలంతా చైతన్యవంతులై కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ, డివిజన్ అధ్యక్షురాలు మహేశ్వరీ, అరుణోదయ సమితి రాష్ట్ర కార్యదర్శి మల్లన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న భగీరథ నీరు



వాటర్ ట్యాంక్ వద్ద నిలిచి ఉన్న నీరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో నిర్మించిన మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి రోజువారీగా నీరు వృథాగా పోతోంది. గడిచిన నాలుగైదు రోజుల నుంచి గంటల కొద్ది నీరు ట్యాంకుపై నుంచి కిందికి ధారావాహికంగా పారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ట్యాంకు నిండిన తర్వాత వెంటనే నీటి సరఫరాను నిలిపివేయాల్సి ఉండగా, అశ్రద్ధ చేస్తున్నారు. దీంతో నీరంతా పక్కనున్న అమ్మ అనాథ శరణాలయంలో, పరిసర ప్రాంతాల్లో మడుగులు కడుతున్నాయి. విధి నిర్వహణలో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. భగీరథ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుని నీరు వృథాగా పోకుండా చూడాలని కోరుతున్నారు.

'హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలం'

చెన్నూర్: ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో సీపీఎం చెన్నూర్ ఏరియా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా, వైద్యం ప్రతీ పేద ప్రజలకు అందించాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల నూతన కార్యవర్గ కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, కావెరి రవి, బొడ్డ సరిత, బోడెంకి చందు సీపీఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వికాస్‌నగర్‌లోని పృథ్వి అపార్టుమెంట్ పక్కన గల ఓపెన్ ప్లాటులో అపార్టుమెంటు వాసులు వేసిన చెత్తతో ఇలా...

ఓపెన్ ప్లాట్లు.. ప్రజల పాట్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఇళ్ల మధ్య ఖాళీగా ఉన్న ఓపెన్ ప్లాట్లలో పిచ్చిమొక్కలు మొలిచి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఇళ్లు, అపార్టుమెంట్ వాసులకు సమీపంలోని ఓపెన్ ప్లాట్లలో చెత్త వేస్తుండడంతో పందుల తాకిడి పెరుగుతోంది. దీనిపై మున్సిపల్ కమిషనర్‌కు పలువురు కాలనీవాసులు ఫిర్యాదులు చేస్తున్నా, ఓపెన్ ప్లాట్ల యజమానులకు గాని, అందులో చెత్తను వేస్తున్న వారిపై గాని ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వికాస్‌నగర్ కాలనీలో గల పృథ్వి అపార్టుమెంట్‌ను ఆనుకొని ఓపెన్ ప్లాటు ఉండగా, ఇళ్లల్లోని చెత్తా చెదారాన్ని అందులో వేస్తుండడంతో, పందులు వస్తున్నాయంటూ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా, చర్యలు లేవు. పట్టణ శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో డ్రెయినేజీల వ్యవస్థ లేకపోవడంతో, ఓపెన్ ప్లాట్లలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు వచ్చి చేరి దోమలకు నిలయంగా మారుతోంది. డ్రెయినేజీలను నిర్మించకపోవడం, ఓపెన్ ప్లాట్లలోకి మురుగు చేరకుండా చేయకపోవడంతో సీజనల్ వ్యాధులకు నిలయంగా మారుతున్నాయి.



శ్రీనివాసకాలనీలో ఓపెన్ ప్లాట్‌లో పిచ్చిమొక్కలు..



ఆంధ్రాకాలనీలో ఇళ్ల మధ్య ఓపెన్‌ప్లాటు ఇలా..



ప్రగతినగర్‌లో ఓపెన్‌ప్లాటులో పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



భీమారం: మొక్కనాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే

జైపూర్/మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్)/భీమారం/చెన్నూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలకు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో పాటు మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం 8700 మందికి గ్యాస్ రాయితీ ధృవీకరణ పత్రాలు, 70 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. జైపూర్, రామకృష్ణాపూర్, భీమారం మండల కేంద్రాల్లో శనివారం పర్యటించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమరవాధిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భీమారంలో స్వచ్ఛతా హీ సేవ 2024వజ్రోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటారు. మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారిలో భీమారం జోడువాగుల వద్ద రోడ్డు ధ్వంసం కావడంతో, కేంద్ర మంత్రి గడ్కారీని కలిసి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మండల కేంద్రం నుంచి ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు వారి సమస్యలపై వినతిపత్రాలు అందించగా సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో చెన్నూర్‌లో తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, భీమారంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, పాడేటి రవి, పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఎంపీడీవో మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త సత్తిరెడ్డి, జైపూర్‌లో తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపురావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్'



అవగాహన కల్పిస్తున్న సీఐ అఫ్జలొద్దీన్

నెన్నెల: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ అన్నారు. మండలంలోని శ్రావణ్‌పల్లిలో ఎస్సై ప్రసాద్‌తో పాటు 25మంది పోలీసు ఫోర్స్‌తో కలిసి శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సోదాలు చేసి ధృవపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. 150లీటర్ల గుడుంబాను ధ్వంసం చేసి ఒకరి వద్ద 20లీటర్ల నాటుసారా స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేశారు. గ్రామంలో పోలీసు డాగ్ ద్వారా అనుమానం ఉన్న గంజాయి రవాణా, తాగే, విక్రయించే వారిని గుర్తించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఏదైన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాళ్లగురిజాల, బెల్లంపల్లి టూటౌన్ ఎస్సైలు రమేష్, మహేందర్, పోలీసులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌వాడకం ప్రమాదకరం



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

వేమనపల్లి: ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ప్రాణాంతకమని కిరాణషాపు యజమానులకు డీపీవో వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీని శనివారం పీఏస్‌యాప్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా సందర్శించి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామపంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. ఎక్కడ కూడా ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు లేకుండా సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగించాలని, రోడ్లపై మురుగునీరు నిల్వలేకుండా చూడాలన్నారు. దోమలు, ఈగల ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా నాలీల పూడిక తీయించాలని, ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో 'స్వచ్ఛతా హీ సేవ' భాగంగా ప్రజలకు ఎంపీడీవో గంగామోహన్ అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో శనివారం ర్యాలీ చేపట్టి దుకాణదారులకు ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని 45మంది మల్టీపర్పస్ వర్కర్(ఎంపీడబ్ల్యూ)లకు వైద్యుడు కుమారస్వామి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రతి ఒక్క ఎంపీడబ్ల్యూకు రూ.15లక్షల వరకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేయించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం అశోక్, ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం వొద్దని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న యువజన సమాఖ్య నాయకులు

బెల్లంపల్లి: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను ధారపోసిన స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ఆశయాల సాధనకు తుది వరకు పాటుపడతామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ అన్నారు. భగత్‌సింగ్ జయంతిని శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఎంసీపీఐ(యూ), అనుబంధ సంఘాల నాయకులు విప్లవ జోహార్లు అర్పించారు. భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ)జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నేటి యువత పాటుపడాలని, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి లింగం రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం భగత్ సింగ్ జయంతిని జరుపుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా సమితి నాయకులు పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి

మంచిర్యాలఅర్బన్: భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. స్థానిక మిమ్స్ డిగ్రీ కళాశాలలో శనివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ బొగ్గుబాయి వార్తలు

కార్మికుల నిరసన

బెల్లంపల్లి: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఇఫ్టూ నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి సివిక్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు అసంఘటిత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు శ్యామ్, సురేశ్, వెంకటి, లింగన్న, కొమురన్న, కుమార్, శ్రీనివాస్, కృష్ణవేణి, చంద్రకళ, సునీత, కరుణ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియాలో మాదిరిగా హై పవర్ కమిటీ వేతనాలను చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్కే 7 గని పై ఏర్పాటు చేసిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులు 10సంవత్సరాలుగా వేతనాలు పెంచక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. హైపవర్ కమిటీ వేతనాలను చెల్లించలేని పక్షంలో కనీసం రాష్ట్ర ప్రభుత్వ జీవో 22ను అనుసరించి వేతనాలైనా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, నాయకులు శ్రీనివాస్, దిలీప్, విక్కీ, ఆదిత్య పాల్గొన్నారు.

'తప్పుడు ప్రచారం మానుకోవాలి'

శ్రీరాంపూర్: సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, దీని వల్ల సంస్థలకు నష్టం అంటూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఐఎన్‌టీయూసీ నాయకులు తెలిపారు. ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు నస్పూర్ కాలనీలోని ఆ యూనియన్ కార్యాలయం వద్ద శనివారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పేరుతో ఏఐటీయూసీ నాయకులు కార్మికులను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ఆర్కే 7గనికి పర్యావరణ అనుమతులు ముగిసి గని మూసి వేసి, కార్మికులను ఇతర గనులను బదిలీ చేస్తారనే సమయంలో కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయినా, గని మూతపడకుండా కాపాడింది రాజకీయ జోక్యంతో కాదా అని ప్రశ్నించారు. కార్మికులకు మంచి చేసేందుకే నేతలు ప్రయత్నిస్తే దాన్ని కూడా విమర్శించడం తగదన్నారు. శ్రీరాంపూర్‌లో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీలో ఎమ్మెల్యే పదిమంది పేర్లను పరిశీలించమని స్థానిక అధికారులకు సూచిస్తే, ఆయన వల్లే ప్రమోషన్లు ఆగిపోయాయని ఏఐటీయూసీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీన్ని ఖండిస్తున్నామన్నారు.ఎమ్మెల్యేలు, ఉప ముఖ్యమంత్రి, యూనియన్ నేతలను కలిసి సింగరేణి కార్మికులకు మేలు చేయాలని ఉద్దేశంతో లాభాల్లో వాటా పెంచి ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు శ్యామ్, భీంరావు, స్వామి, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

రోజువారీ ఉత్పత్తి లక్ష్యాలు పెంచాలి

- జీఎం దేవేందర్



కాసిపేట 1ఏ టన్నల్ పరిశీలిస్తున్న జీఎం దేవేందర్

కాసిపేట: గనుల్లో రోజువారీగా సాధిస్తున్న ఉత్పత్తి లక్ష్యాలను పెంచుతూ, ఎల్లప్పుడు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అధికారులకు సూచించారు. మందమర్రి ఏరియా కాసిపేట 1ఏ టన్నెల్‌ను శనివారం జీఎం సందర్శించారు. గనికి సంబంధించిన మ్యాప్‌లు, ప్లాన్‌లను పరిశీలించారు. పనిస్థలాలను మెరుగుపరుచుకుంటూ అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు సమన్వయంతో ఉత్పత్తి సాధనలో ముందుకు సాగాలన్నారు. అనంతరం టన్నెల్ పరిసరాలలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ భూశంకరయ్య, గ్రూప్ ఇంజనీర్ రాంప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

రేపు జోనల్‌స్థాయి పోటీలు

మంచిర్యాలఅర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్(జోనల్) స్థాయి అండర్-14, 17బాల బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు ఈ నెల 30న బొక్కలగుట్ట హవెన్ ఆఫ్ హోప్ పాఠశాలలో జరుగుతాయని పాఠశాల క్రీడా సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫణిరాజా తెలిపారు. ఎంపికైనా క్రీడాకారులు వచ్చే నెల 3న బాలురకు ప్రకాశం గ్రౌండ్ కొత్తగూడెం, బాలికలకు ఇందిరాగాంధీ స్టేడియం మెదక్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

లక్సెట్టిపేట్‌లో రెజ్లింగ్ పోటీలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-14, 17బాలికల రెజ్లింగ్ ఎంపిక పోటీలు 30న లక్సెట్టిపేట టీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ గర్ల్స్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఫణిరాజా తెలిపారు. ఎంపికైనా బాలికలు 3న ధన్వాడ గ్రౌండ్ నారాయణ పేట్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వనదర్శిని



విద్యార్థులతో ఫారెస్ట్ సిబ్బంది

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): లక్సెట్టిపేట అటవీశాఖ ఆధ్వర్యంలో శనివారం వనదర్శిని కార్యక్రమంలో భాగంగా నస్పూర్(సీసీసీ) చెందిన ఆదిత్య హైస్కూల్‌కు చెందిన విద్యార్థులతో బొక్కలగుట్ట అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అటవీశాఖ రేంజ్ ఆఫీసర్(లక్సెట్టిపేట) సుభాష్ విద్యార్థులకు ఫారెస్ట్‌లోని పెద్ద వృక్షాలు, వన్య మృగాలు, అటవీ ప్రాంతంలో పెరిగే వివిధ రకాల జాతుల గడ్డి వివరాలు, బట్టర్‌ఫ్లై రకాల గుర్తింపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గాంధారి ఖిలా సందర్శించి పురాతన నిర్మాణాలను పరిశీలించారు. అక్కడి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ అహమ్మద్, బీట్ ఆఫీసర్ రత్నసింధు, అటవీశాఖ సిబ్బంది పాఠశాల కరస్పాండెంట్ సత్తయ్య, ప్రిన్సిపల్ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

అవగాహన సదస్సు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ మీటింగ్ హాల్లో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్‌కు సంబంధించిన అవగాహన సదస్సును మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఎస్‌పీఎం సెంటర్లలోని సిబ్బందికి, షిర్డీ సాయి ఎలక్ట్రికల్ వారితో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ ఎన్ శ్రావణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డీఈలు, ఆపరేషన్ ఏడీలు, ఎంఆర్‌టీ ఏడీఇ, ఎంఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ అర్చకులకు శిక్షణ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఏకలవ్య ఆశ్రమంలో మూడు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామీణ అర్చకులకు పూజారీ శిక్షణ కార్యక్రమాన్ని గ్రామ దేవాలయ అర్చక పరిషత్, ధర్మ జాగరణ తెలంగాణ ప్రాంతం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం అక్టోబర్ 01వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ధర్మ జాగరణ విధి ప్రముఖ్ జితేందర్, ప్రాంత పరియోజన ప్రముఖ్ దయానంద్, విభాగ్ ప్రముఖ్ ఇప్ప లచ్చన్న పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక

జన్నారం: మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలకు చెందిన బండ సాకేత్ నవోదయ ప్రవేశ పరీక్షలో ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సతీశ్‌గౌడ్ తెలిపారు. రెండో విడుత ఫలితాల్లో సాకేత్ సీటు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాకేత్‌ను పాఠశాల ఇన్‌చార్జి తిరుపతి, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, అభినందించారు.

భూకబ్జాపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాల బస్తీలో టీడీపీ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్నీ అక్రమంగా కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి టి.మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ముందు శనివారం నిరసన తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

భీమిని: మండలంలోని ఖర్జీబీంపూర్‌లో శనివారం పిచ్చికుక్కల దాడిలో పలువురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన ఠాకూర్ ఆనంది, టేకం రక్షితతోపాటు పలు పశువులపై దాడి చేసి గాయపర్చింది. యువకులు పిచ్చికుక్కను చంపివేశారు. చిన్నారులను పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అందించారు. పశు వైద్యాధికారులు గాయపడిన పశువులకు చికిత్స అందించాలని గ్రామస్తులు కోరారు.

పెంపుడు కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

భీమారం/దండేపల్లి: పెంపుడు కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారులు సూచించారు. భీమారం, దండేపల్లిలో ప్రపంచ రేబిస్ దినోత్సవం నిర్వహించారు. పశువైద్యశాలల వద్ద పెంపుడు కుక్కలకు రేబీస్ నివారణ టీకాలు వేశారు. కార్యక్రమాల్లో భీమారం వెటర్నరీ వైద్యాధికారి రాకేశ్ శర్మ, దండేపల్లి మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

జన్నారం: మండలంలోని బాదంపల్లిలో శనివారం క్షేత్రస్థాయిలో వరి, పత్తి పంటలను వ్యవసాయ అధికారి సంగీత సిబ్బందితో కలిసి పరిశీలించారు. పంటలకు సోకుతున్న తెగుళ్లు, వాటి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

'హిందుత్వంపై ప్రచారం చేయాలి'

మంచిర్యాలఅర్బన్: గ్రామగ్రామాన హిందుత్వంపై విస్తృత ప్రచారం చేయాలని హైకోర్టు న్యాయవాది తెలంగాణ ధర్మజాగరణ ప్రముఖ్ జితేందర్ అన్నారు. మంచిర్యాలలో తెలంగాణ ధర్మ జాగరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూజారి శిక్షణ వర్గ కార్యక్రమానికి శనివారం హాజరై ప్రసంగించారు.

హెచ్ఐవీపై అవగాహన

కాసిపేట: సోమగూడెం బ స్టాండ్ వద్ద కళాజాత బృందం సభ్యులు శనివారం హెచ్ఐవీ ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

'మాదకద్రవ్యాలు వినియోగిస్తే చర్యలు'

నస్పూర్: నిషేధిత మాదక ద్రవ్యాలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సంతోశ్ హెచ్చరించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని పలు ప్రాంతాల్లో శనివారం నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు.

30న పట్టుపురుగుల పెంపకంపై అవగాహన

జన్నారం: ఈ నెల 30న జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ రైతువేధికలో రైతులకు పట్టుపురుగుల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు పార్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బస్ షెల్టర్ ముందు బస్సులు నిలుపాలి

మందమర్రిరూరల్: పాత బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ ఆఫీస్ వద్ద ఆర్టీసీ బస్‌షెల్టర్ ఏర్పాటు చేశారని, అక్కడే ఆర్టీసీ బస్సులు నిలుపాలని కోరుతూ శనివారం మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్‌కు బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ వినతిపత్రం అందించారు.

పోషకాహారం తీసుకోవాలి

చెన్నూర్: గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని సీడీపీవో మనోరమ అన్నారు. పోషణ మాసంలో భాగంగా శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఏవో, ఏఈవోలకు వీడ్కోలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేట రైతువేదికలో శనివారం ఏవో మార్గం రజిత, ఏఈవోలు కనకరాజు, శ్రీనికలను వ్యవసాయ శాఖ, వ్యవసాయ శాఖ డీలర్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, ఆయా మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

కోటపల్లి: మండలంలోని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు డాక్టర్ అరుణశ్రీ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు.

ప్రొసీడింగ్‌లు పంపిణీ

లక్సెట్టిపేట: గృహజ్యోతి పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ప్రొసీడింగ్‌లను అందజేశారు.